# "లోభి హృదయం"

పి. భానుమతి

పెద్దబజారు కిటకిటలాడుతోంది. ఎండకు తట్టుకోలేని జనం మెల్లగా అంగళ్ళలో జొరబడి సామాన్లు కొనకపోయినా, బేరంచేసే మిషతో కాసేపు నీడన నిలబడుతున్నారు. పానకాలుసెట్టి చలివేంద్రంలోని మంచినీళ్ల పీపాలకు పీపాలు ఖాళీఅయిపోయాయి. ప్రక్కనేవున్న కనకాలసెట్టి చిల్లర దుకాణంకూడ కిటకిటలాడుతోంది బేరగాళ్ళతో. బొమ్మకొలువులో పెద్ద బొమ్మలాగా పట్టెనామాలు పెట్టుకొని కూర్చుని, సెట్టి హడావుడిగా పొట్లాలుకట్టి వచ్చినవాళ్ళ కిస్తున్నాడు. పదేళ్ళ పిల్ల మాత్రం ప్రొద్దుట్నుంచీ కనకాలుసెట్టి అంగడి గుంజకానుకొని అలాగే నిలబడ్డది. పాలిపోయినముఖం - ముఖంమీదా - కళ్ళమీదా పడేజుట్టు - లోతుకుపోయిన కండ్లు - ఆపిల్ల సాక్షాత్కరించిన దుఃఖదేవతలాగుంది. తదేకధ్యానంతో సెట్టివైపే చూస్తూ, సెట్టికి ఎప్పుడు దయకలుగుతుందా! అని నిరీక్షిస్తున్నాయి ఆ పిల్లకండ్లు.... కనకాలుసెట్టి మాత్రం ఆ పిల్లవైపు కన్నెత్తికూడా చూడకుండా తన వ్యాపారంలో నిమగ్నుడయి వున్నాడు. కాని ఆ పిల్ల అంతసేపట్నుంచీ అలాగే నుంచోడం సెట్టికి ఒళ్లుమంటగానే వుంది. ఎన్నితడవలు చెప్పినా తనమాట లక్ష్యపెట్టకుండా అక్కడనుంచి కదలనంటుందేం! "నీకే గదమ్మాయ్ చెప్పేది! వినిపించడంలా ఫో.... ఫో.... మీ నాన్న డబ్బు పంపినప్పుడే తీసుకురా. అప్పుడే సరుకులిస్తానని మీ అవ్వతోచెప్పు, ఫో...." అని కసిరాడు. పదేళ్ళపిల్ల అతని మాటలకు చలనంలేకుండా ప్రతిమలాగా అలాగే నిలుచుంది.... జాము ప్రొద్దెక్కింది.... సెట్టి దుకాణానికి వచ్చేజనం పల్చపడ్డారు.... భోజ

నానికి లేచాడు సెట్టి. యింకా పిల్ల అలాగే అక్కడేవుంది. సెట్టికి ఈసారి విపరీతంగా ఒళ్ళుతెలీని కోపం వచ్చింది. చేతులోవున్న తువ్వాలు ఝుళిపించుతూ, "ఏయ్! అమ్మాయ్! వెడతావా లేదా! శని గ్రహంలా పట్టుకున్నావేం! పోతావా మెడబట్టి గెంటమంటావా? నోరు లేనిపిల్లవిగదా అని చూస్తుంటే మొండికి పడతావా, కదులు ముందు ఇక్కడ నుంచి.... ఊ! యిందా నీ పలక తీసుకపో" అని పలక ఆ పిల్లముందు ఎత్తిపడేశాడు.... మెట్లమీదపడ్డ పలక బద్దలయింది...."సెట్టి....గా....రూ....సేరు....బి....య్యం.... పుణ్యం....నాలుగు....పస్తు.... నోరులేని.... పిల్లముఖం....యివ్వండి" అని అవ్వ రాసిచ్చిన అక్షరాలు పలక ముక్కల్లో చిందరవందర అయ్యాయి....పదేళ్ళపిల్లకి దుఃఖం పొంగు కొచ్చింది....రెండేళ్ళనాడు ఆ పలకను సెట్టే ఆ పిల్ల కిచ్చాడు ధర్మంగా. సరుకులు కొంటానికి వచ్చినప్పుడు ఆ పిల్ల మూగభాష అర్థంకాక, సెట్టి ఒకరోజు ఆ పలకయిచ్చి ఏం కావాలో ఇంట్లో అవ్వచేత వ్రాయించుక రమ్మని ఒక బలపంకూడా యిచ్చాడు. అప్పట్నుంచి ఆ పిల్ల పలకను తన ప్రాణప్రదంగా కాపాడుకొంటోంది. ఆ పిల్లపలుకు ఆ పలకే! తనేం చెప్పాలన్నా అవ్వచేత పలకమీద వ్రాయించుకొచ్చేది.... బడికిపోయే అదృష్టం ఆ పిల్లకి లేకపోయినా, రోజూ ఆ పలక చేతపట్టుకొని, సెట్టి అంగడికొచ్చి, కాణీ బోణీచేసి యింటికి కావల్సిన వెచ్చాలు, అవ్వ పలకమీద రాసిచ్చినవి, పట్టుకెళుతుంటుంది. అవ్వ డబ్బిస్తే తెచ్చి సెట్టి కిచ్చి పలకచూపేది. సెట్టి నవ్వుతూ సరుకులు పొట్లాలుకట్టి, చిన్న బుట్టలోపెట్టి నెత్తిమీద పెట్టేవాడు. ఆ పిల్ల వెళ్లొస్తానని మూగభాషలో చెప్పి, పలక పుచ్చుకొని బుట్ట తలమీద పెట్టుకొని వెళ్లేది. ఈ విధంగా రెండు సంవత్సరాలనుండీ జరుగుతోంది....యీసారి డబ్బు అవ్వయివ లేదు. ఆ నోరులేనిపిల్లకు ఎందు కివ్వలేదో ఏంతెలుసు! అవ్వ ఎప్పుడ యిచ్చేది. ఈసారి ఎందు కివ్వలేకపోయిందో? ఆ పిల్లకు తెలిసిన మ

భాష "లేదు" అని. అదే సెట్టితో చెప్పింది తనభాషలో. సెట్టికి తనభాష అర్థం అయినాకూడా కనికరంలేకుండా కసురుకున్నాడు....అంతేకాకుండా తనపలక క్రిందపడేసి పగులగొట్టాడు. పదేళ్ళపిల్లకి దుఃఖం ఆగింది కాదు. లంగాతో కళ్ళు తుడుచుకుంటూ పలకముక్కల్ని ఏరి వొళ్ళో వేసుకుంది. సెట్టి రాక్షసుడిలాగ గుడ్లు పెద్దవిచేసి ఇంకా పోవేం, అన్నట్లు చూస్తున్నాడు నుంచొని. ఆ పిల్లకి సెట్టిని కన్నెత్తిచూసే ధైర్యం లేకపోయింది. భయంతోనూ, అవమానంతోనూ ఆ చిన్ని మూగ హృదయం తల్లడిల్లిపోయింది.... కళ్ళనిండా నీళ్ళు నిండాయి. ఆకలితో వున్న ఆపిల్లకళ్ళు ఆనీళ్ళు తాగేశాయి. ప్రొద్దుట్నుంచి నిలబడ్డదేమో కాళ్ళు పీకాయి....ఇక అక్కడుండే సెట్టి కొడతాడేమోనని, శక్తిలేక పోయినా ఆ పిల్ల లేనిబలం తెచ్చుకొని క్షణంకూడా అక్కడ నిలవ కుండా మెరుపులాగ పరుగెత్తిపోయింది....సెట్టి ఆ పిల్ల హఠాత్తుగా అలా పరుగెత్తిపోవడంచూచి కొయ్యబారిపోయాడు. ఆ పిల్లవెళ్ళిన వైపే చూస్తూ అలాగే నించుండిపోయాడు. ఆ పిల్లమీద అంతకోపం ఎందుకొచ్చిందోకూడ తెలీనిస్థితిలో వుండిపోయాడు సెట్టి....అటువంటి అమాయక మూగపిల్లను తను అంతగట్టిగా కసురుకోనవసరంలేదు.... అయినా కసురుకున్నాడు. కసురుకోకపోతే, మొండికి పడుతుందాయె! ఎట్లా? ఛీ! పీడాకారంపిల్ల, వదిలింది అంతేచాలు అని విసుక్కుంటూ లోపలికివెళ్ళాడు సెట్టి.

"అదేమిటండీ! అట్లావున్నారు?" అంది సెట్టి భార్య అన్నం వడ్డిస్తూ. "ఆ! ఎట్లా వున్నానూ!" అన్నాడు పరధ్యానంగా వున్న సెట్టి.... "బాగానేవుంది? నన్నడిగితే." అని విసుక్కుంది భార్య.... "ఓ! అదా! ఆ....అదే.... ఆ దోశీపిల్లని అప్పివ్వను పొమ్మని కసిరాను. దాని కాపిల్ల కళ్లనీళ్ల పెట్టుకొనిపోయింది. నోరులేదు కదూ" అని గొణిగాడు. ఆ గొణుగుడు సెట్టికే వినిపించింది. "ఆ పిల్లకు మరీ

మీదగ్గిర అరువు ఎక్కువ. ఎంతవాడు లేకపోతేమాత్రం ఇంత అప్పు ఎవరిస్తారూ అంటు, పోనీ: పోనీ: అని దాని ఒళ్లో వేస్తోంది ఆపిల్ల.... యాక ఇవ్వరంటి" అంది. ఎందుకో సెట్టి తప్పుచేసినవాడి లాగా, దొంగతనం చేసినవాడిలాగా, దారుణమైన దోషం చేసినంత అవస్థపడ్డాడు. ఆ పిల్ల ముఖం దీనంగా తనవైపే చూస్తున్నట్టుంది. సెట్టి ఆ చూపులకు తట్టుకోలేక తనలో తాను దాక్కోడానికి ప్రయత్నించాడు. కాని దాక్కోడానికి చోటులేదు. తనలోవుండే మరొక మనిషి తన దొంగతనాన్ని పట్టేసినట్టు సెట్టి కంగారు పడటం మొదలెట్టాడు.... తనలో హృదయం అనేదికూడా వుందని సెట్టికింకా అప్పటికి తెలీదు. ఒకవేళ వుండినా ఆ హృదయం మాట్లాడుతుందని గాని, పోట్లాడుతుందనిగాని ఎరుగడు. ఒకవేళ మాట్లాడినా, పోట్లాడినా, తనలోపలవుండే మనిషే కాబట్టి తన వ్యాపారానికి లాభం వచ్చే మంచో చెప్పమని రాజీపడతాడేగాని, సెట్టి ఎప్పుడూ ఎవరితోనూ దెబ్బలాడడు. అసలు పోట్లాటలంటేనే సెట్టికి భయం.

హృదయం అందరిలోనూ వుంది. ఎప్పుడూ శకున పక్షిలాగా ఏదో చెబుతూనే వుంటుంది. మనిషిని శాయిశక్తుల మంచిమార్గాన పెట్టడానికి ప్రయత్నిస్తూనే వుంటుంది. దాని నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి నోరుమూసుకో, అని హృదయం నోరుమూసి, తనను తాము మోసం చేసుకొనేవారూ వున్నారు. హృదయం చెప్పినట్టు విని జీవితాన్ని సన్మార్గంలో తీసికెళ్లేవారూ వున్నారు. అందులో మొదటి రకంవాడు సెట్టి. హృదయం నోరు మూస్తేనేగాని తన వ్యాపారం నడవదుమరి.... ఒక్కొక్కప్పుడు నోరుమూసినా మాట్లాడేశక్తి హృదయాని కున్నదని సెట్టికి తెలీదు: 'నోరులేని పిల్లని కసురుకున్నావే దుర్మార్గుడా: ఎంతవ్యాపారం అయినా ఇంత అమానుషంగా ప్రవర్తిస్తావా?' అని సెట్టి హృదయం లోపలనుంచి గోలపెడుతోంది.— "ఆ: కసురుకోకపోతే ఎన్నాళ్లు

అప్పివ్వడం ? ఎదో నోరులేని పిల్లగదా ! అనీ, చితికిపోయిన కుటుంబం అనీ ఇన్నాళ్లూ చూశాను, అప్పుమూడునెల్లనుండీ అలాగే పేరుకుపోయింది, దికాయిపడితే తీర్చద్దూ. వాళ్ళ మంచికే చెప్పాను. వడ్డీ లేనేలేదు, అసలైనా ఇవ్వకపోతే నావ్యాపారం ఏంగతిగాను ? నువ్వు నోరుమూసుకో" అని హృదయాన్ని చీవా ట్లేశాడు సెట్టి. హృదయం బాధగా మూలిగింది....

"అదేమిటండీ ! అన్నం తినకుండా ఆలోచిస్తున్నారూ ?" అని సెట్టిభార్య దీర్ఘం తీసింది.... సెట్టి వులిక్కిపడి.... "ఆ ! ఆ ! అదే, ఆ పీడాకారం పిల్లనుగురించే ఆలోచిస్తున్నా— ఏదోలాగవుంది మనసు" అని గొణుగుతూ, నాలుగు మెతుకులు కొరికి లేచాడు. "ఆ ! మీది మరీ విచిత్రంగావుందే ! ఆ పిల్లనుగురించి మనసు ఇంత పాడుచేసుగోటానికి ఏ మొచ్చిందీ అంట ! ఇక అప్పివ్వకండి. రోగం కుదురుతుంది," అంటూ విస్తరితీసుకొని పెరట్లో కెళ్ళింది సెట్టిభార్య. తన హృదయం కంటె భార్యే మేలనిపించింది సెట్టికి. భార్యచెప్పిన మాటలు తన వ్యాపారానికీ, తనకీకూడా లాభదాయకంగా వున్నాయి. మరి తన నాసి హృదయానికి ఆ మాత్రం తెలివిలేకుండావుంది. తనకి నష్టం తీసుకురావదానికి ప్రయత్నించడమేకాకుండా తనకూ, తన వ్యాపారానికీ కాళ్ళకడ్డం పడుతోంది. వెధవ హృదయం. యిలాంటి చచ్చుహృదయం ఏ సన్యాసుల దగ్గిరనో, బైరాగుల దగ్గిరనో వుండాలికాని, తనలాటి వ్యాపారిదగ్గర వుండకూడ దనుకున్నాడు. ఎప్పుడూ, ఏదో లోపల గొణుగుతూనే వుంది. తను లెక్కచేయడంలేదు కాబట్టే వ్యాపారానికి ఎలాటినష్టమూ రాకుండా అంతవరకు జాగ్రత్తగా తీసుకరాగలిగాడు. పది రూపాయలతో ప్రారంభమైన వ్యాపారం పదివేల రూపాయలదాకా వుంది ప్రస్తుతం.

"అసలు నీవు చేసింది తప్పుకాకపోతే నాతో ఎందుకు దెబ్బలాడాలి ?" అని సూటిగా అడిగింది హృదయం. అవును, అదీ నిజమే. తను చేసింది మంచిపనే అయితే ఇందాకటినుంచి తనెందు కింత

రాధమ్మగారు! సెట్టి బంగారుమన్నారు. 'నా ప్రశ్నకు సమాధానం చెప్పావ్!' నిలదీసింది. ఇప్పటిదాకా మూలుగుతూండే పెద్దసెట్టి, నోరు మూశారు. అప్పుడు తన మీదకు పోట్లాటకే తయారయ్యిందే! సెట్టికి ఏంచెయ్యాలో తోచలేదు.... పెళ్లాం పోటీస్తే వ్యాపారంలో వచ్చిన వడ్డీతో నగలు చేయించి పెట్టగలడు— పిల్లాడు మారాంచేస్తే బెల్లంముక్క— చేతిలోపెట్టి ఊరడించ గలడు— మరి తనలో వుండి కనబడకుండా పోరాడే హృదయాన్ని ఏం చేయాలో తెలీక సతమతమవుతున్నారు. ఇలా అయితే బంగారంలాంటి తన వ్యాపారం ఏమయ్యేట్టు! తనహృదయం చెప్పినట్లువినాల్సిందే! అమ్మో! కళ్లు గట్టిగా మూసుకొని పడుకొన్నారు సెట్టి— హృదయం సెట్టిని అనేక విధాల లొంగదీయడానికి ప్రయత్నించింది.... "చూడూ! ఆ పిల్ల ఎన్నో రోజులుగా భోజనంలేని ఆ కుటుంబంకోసం నీ అంగడిముట్టూ తిరుగు తోందో! వాళ్లనాన్నకేం కష్టంవచ్చి డబ్బుపంపలేదో! కష్టాలు నీకుమాత్రం రావా? ఆ కుటుంబాన్ని పస్తుపెడితే నీకేగా ఆ పాపం! నీ కొడుకే అలా అన్నంలేకుండా వుంటే...." "ఛీ! ఛీ! నా కొడుకు అట్లా ఎందుకు అవుతాడు! పీడాకారం మనసు పాడుచేస్తుంది"— అని సెట్టికి నల్లులు కుట్టినట్లు పక్కమీదనుంచి లేచి కూర్చున్నారు.... "నీవు తప్ప వాళ్ల కింకెవరు అప్పిస్తారు? ఆ నోరులేని పిల్లను నమ్మి ఎవరిస్తారు? ఏదైనా సహాయం చేయలేకపోతే వాళ్ల పసురు నీ కుటుంబానికి తగులుతుంది" అని బెదిరించింది హృదయం— లేచి మంచున్నారు. అప్పట్లో ఆ పిల్ల ఇంటికి వెళ్లిందా?....లేదే! రోజూ ఇంటికి వెళ్లే దోవనపోలేదే! ఏమో! పీడాకారం పిల్ల ఏపెడితే తనేం చేస్తాడు! అయినా పోట్టివాళ్లని గురించి తను మనసుతో ఘర్షణపడటం దేనికి! ఛా! ఛా! ప్రొద్దున లేచిన వేళ మంచిదికాదు, అనుకొని అటూ ఇటూ పచార్లు చేయడం మొదలెట్టారు.

సెట్టి భార్యని లేకేలాడు తనకు వత్తాసిగా ఏదయినా మాట్లాడుతూ ఉంటుందని. ఒంటరిగా వుండే తన హృదయం స్వారీ చేస్తోంది.

తనొక్కడే పోట్లాడటానికి భయంగా వుంది. సెట్టిభార్యకోసం పం
ల్లోకి వెళ్ళాడు. లేదు. పక్కింటికి పెత్తనానికి వెళ్లింటుంది. హృ
యంతో పోట్లాడి సెట్టి అలిసిపోయాడు. ఇక తనకు శక్తిలేదు. వి
తంగా దాహంవేసింది. నాలుగులోటాల నీళ్లుతాగేశాడు. చేయిజారి కం
లోటా కాలిమీద పడ్డది. "అబ్బా!" అంటూ సెట్టి అలాగే కూలబడ్డాడు.
"ఇంతమాత్రానికే నీ మొద్దుశరీరం గాయపడిందని బాధపడుతున్నావే,
సున్నితమైన ఆ పిల్ల మూగహృదయం ఎంత బాధపడిందో ఆలోచిం
చావా ?" అని ఎత్తిపొడిచింది హృదయం___ "నా వృత్తిధర్మం నే
చేశాను. దానికి సాధిస్తావేంటీ ? అయినా నేనేం చేయాలో అఘోరిం
రాదూ. వూరికే నసుగుతూ ప్రాణాలు కొరుక్కుతినకపోతే!" అని సెట్టి
విసుక్కుంటూ రాజీకి దిగాడు హృదయంతో. "అదంతా నన్నడక్కు.
నీ తప్పు నీవు తెలుసుకోవడం నాక్కావలసింది. ఆపైన నీయిష్టం,
ఆ పిల్లకి న్యాయం చెయ్యి. ఆ కుటుంబం పస్తుపడుకోకుండా చూడు.
అంతే" అంది. సెట్టివిసుక్కుంటూ, నసుక్కుంటూ, కాలిబాధతో కుంట
కుంటూ పద్దు పుస్తకం తీశాడు. ప్రతినెలా ఆపిల్ల డబ్బు తెచ్చి యిచ్చిన
జమలు వున్నాయి. మాటతప్పిన పిల్లకాదు. ఎన్నడూ ఏసరుకూ కొస
అడిగిన పిల్లకాదు. ఎంతోమంది మూగపిల్లలను చూశాడుగాని ఈ పిల్ల
అందరి మూగపిల్లల వంటిదికాదు. ఎంతో మంచిపిల్ల. అందుకే
మూడునెల్లు డబ్బు ఇవ్వలేకపోయినా అప్పుపెట్టాడు. హృదయం సెట్టిని
నెమ్మదిగా లొంగ తీస్తోంది. అది సెట్టికి ఇబ్బందిగానే వుంది. మరొక
వైపు వృత్తిధర్మం చేయి పుచ్చుకొని లాగుతోంది. తలపట్టుక్కూర్చు
న్నాడు సెట్టి. ఆ పిల్ల మళ్ళీ వస్తుందా ? వస్తే బాగుండును. ఈ రోజు
సరుకులైనా యిచ్చిపంపుతాను. పీడాకారప్పిల్ల ఎటుపోయిందో, ఏమో!

ఒకప్పుడు కలవాళ్ళింటి పిల్లలంతా ఇంతే! చింత చచ్చినా
పులుసు చావదన్నట్లు.... ఆస్తిపోయినా అహం చావదు. నోరు లేక



పోయినా చచ్చేంత అభిమానం ఆపిల్లకి. అని అనుకొంటూ పద్దు
పుస్తకం దస్కులో పడేసి చెప్పులేసుకొని బయలుదేరాడు. "ఎక్కడికి
నాన్నా" అన్నాడు అంగట్లో కూర్చున్న కొడుకు. "వస్తానురా. ఇప్పుడే.
కాస్సేపు అంగట్లోనే కూర్చో!" అని కొడుకు ఏదో చెబుతున్నా విని
పించుకోకుండా వెళ్ళిపోయాడు. పక్కింటినుంచి వచ్చినభార్య గొడుగు
తెచ్చేలోగానే వీధిమలుపు తిరిగాడు. ఎన్నడూ సెట్టి యిలా తెగించి
ఎండలో గొడుగులేకుండా వీధిలోకి వెళ్ళినవాడుకాడు. అయినా "సిరికిం
జెప్పదు...." కదా ! ఆపిల్లవుండే దెక్కడో ఎవరికి తెలుసు ? అయినా
ఫలానా మూగపిల్ల ఇల్లెక్కడంటే ఎవరయినా చెపుతారు అనుకొని
అక్కడా, ఆక్కడా విచారించి చివరికి మూగపిల్ల ఇల్లు కనుక్కున్నాడు.

అది ఇల్లుకాదు. పూరిపాక. లోపల ఎవరో మూలుగుతున్నారు
పాకలో - 'ఎవరు లోపల ?' ఆపిల్లను కేకేశాడు. ఎవరూ బయటికి
రాలేదు. ఎండ నెత్తి మాడ్చేస్తోంది. తాను ఎన్నడూ రాలేదు కాతాదార్ల
కొంపలకు. పాపిష్ఠి మూగపిల్ల కాతాతో తన ఖర్మం ఇలా కాలింది
అనుకుంటూ బయట అరుగుమీద చతికిల పడ్డాడు. 'ఆపిల్లను తిట్టరాదు!'
హృదయం హెచ్చరించింది..... "ఆ, తిట్టక ఏం చేయమంటావు ? నా
కొడుకును తిట్టుకోవడంలా ? అట్టాగే!" అని హృదయంతో రాజీ
పడ్డాడు. ఛీ! ఛీ! ఫీడాకారం! ఈ ఎండలో ఎవరికొంపముందో పడి
గాపులు పట్టం, తోటి సెట్లుచూస్తే ఏమనుకుంటారు ? సెట్టి దురభిమానం
వీపుమీద చరిచింది. దిగ్గునలేచి నుంచొన్నాడు. "ఎవరు లోపల" అని
కేకేశాడు. చేతికర్ర సహాయంతో ఒక అవ్వ నెమ్మదిగా బయటికి
వచ్చింది, "ఎవరు నాయనా" అనుకొంటూ. "ఆమూగపిల్ల ఎక్క
డవ్వా?" "ఓహో! సెట్టిగారా! ఏం బాబూ పలకమీద వ్రాసి పంపానే.
తీసుకురాలా ?" "ఆ! తీసుకొచ్చింది. కొత్త ఆగమంటే ఆగకుం పరుడా
గెత్తింది. పలక క్రింద పడేసుకొని పగలకొట్టుకుంది పరుగెత్తడంలో."

సెట్టి చెబుతున్నాడేగాని లోలో బాధతో మెలికలు తిరిగి పోయాడు. “లోని హృదయం సెట్టిని ఛీ! అని అసహ్యించుకొంది. సెట్టి లోపల్లోపల హృదయం కాళ్ల పట్టుకున్నాడు. "తప్పయింది వృత్తి ధర్మం ప్రకారం నిజం చెప్పే ధైర్యం లేక అబద్ధం ఆడాను. ఈసారికి క్షమించు. నీ మాటవిని నేను ఇంత కష్టపడుతున్నప్పుడు. నేను పొరపాటున ఒకటి రెండు అబద్ధాలు ఆడినా నీవు సరిపెట్టుకోకపోతే నా వ్యాపారం ఏంగాను చెప్పు. ఆహా! అసలు అబద్ధం చెప్పకుండా ఎట్లావుండడం.... సరుకులివ్వలేదంటే అవ్వతిట్టిపోస్తే! ఆ తిట్లన్నీ నాకూ. నాకొడుకూ తగలవూ ?" అవ్వ ఏడుస్తోంది. "దాని నోరయినా వాయైనా ఆ పలకేసే! అదీ పగిలిపోయింది. అయ్యో! దేవుడా! ఆ పిల్లను ఎందుకలా పుట్టించావు! ఈ కుటుంబాన్ని ఎందుకు ఇలా పరీక్షలపాలు చేస్తున్నావు తండ్రీ! తిండీ తిప్పలు లేకుండా నాలుగురోజుల్నుంచీ కాలికి బలపం కట్టుకొని తిరుగుతోంది మీ అంగడిచుట్టూ — పోనీ, మీకేమైనా దయకలక్కూడదా! ఆ నోరులేని పిల్లముఖం చూసైనా! ఇంతకీ మా గ్రహచారం నెలనెలా డబ్బు పంపే కొండంత తండ్రీ! ఆయన కెందుకింత జబ్బు చేయాలి! ఎలా వుందో వెళ్ళి చూసే యోగ్యతలేకుండా చేశాడా దేవుడు! పూటతిండికే లేని మాకు రైలుచార్జీలు ఎక్కణ్ణుంచి వస్తాయి! పట్నం ఎలా వెళ్ళగలం? అంతా ఆ దేవుడిదే భారం. యింతకీ ఈ పిల్ల ఏమయిందో ?"

సెట్టి కళ్లుకూడా చెమ్మగిలాయి. అవ్వ చెప్పిందంతా విన్న హృదయం సెట్టిని కొంచెం కొంచెంగా కరగతీస్తోంది.... "నా బిడ్డ ఎటు వెళ్లిందో చూశారా సెట్టిగారూ ?" సెట్టికి అబద్ధం చెప్పే ధైర్యం లేక పోయింది. "నాకు తెలీదవ్వా" అన్నాడు పక్కకు తిరిగి కళ్ల తుడుచు కొంటూ. "అయ్యో నా తల్లీ! ఎక్కడి కెళ్లిందో ఎండలో? నోరైనా లేదే ఏ తల్లినైనా అన్నం అని అడగటానికి! బచ్చలాకైనా వండి



పెడదామని తెచ్చానే తల్లీ! ఎక్కడికి వెళ్లావే? మీ కష్టాలన్నీ చూడమని ఆ పాడుదేవుడు నా రాయుర్దాయం ఎక్కువిచ్చాడే" అని అవ్వ ఏడుస్తూ రాగాలుతీయడం మొదలెట్టింది. సెట్టికి మతిపోయినట్లయింది. తను దుర్మార్గుడు— చూస్తూ ఆ కుటుంబాన్ని శోధపెడుతున్నాడు. వాళ్ల ఉపవాసం ఉంటానికి తనే కారణం. హృదయం సెట్టిని అడకత్తెరలో పోకను నొక్కినట్టు నొక్కింది. తను చేతనయిన సహాయం వెంటనే చేయక పోతే తనకు ఆ కుటుంబం ఉసురు తగులుతుంది. సెట్టి బయలుదేరాడు. ఆ పిల్ల ఎక్కడికి వెళ్లిందో? సెట్టి గొడుగులేకుండా ఎండలో ఊరంతా గాలించాడు. తల దిమ్మెక్కింది.... ఆ పిల్ల కనిపించక పోయేసరికి భయంతో సెట్టికి ముచ్చెమటలు పోశాయి. అంగడికి వెళ్లి సరుకులన్నీ పొట్లాలు కట్టి అవ్వ కివ్వమని కొడుకు నెత్తిన పెట్టి పంపాడు. పెళ్లాం పోట్లాటకొచ్చింది. "నా కొడుకును ఆ దరిద్రం కొంపకు సరుకులు నెత్తిన పెట్టి పంపుతావా" అని— సెట్టి ఏమీ మాట్లాడకుండా కొడుకును సరుకు లిచ్చి పంపి, మళ్లీ పిల్లను వెతకడానికి బయలుదేరాడు.

తను ఎవరితోనూ మాట్లాడే స్థితిలో లేడు. మనసులో ఏదో తెలియని బాధ గుండె పిండుతోంది. ఆ పిల్ల కనిపించిందాకా ఆ బాధ తగ్గదు— ఊరంతా వెదికాడు— పిల్లలాడుకొనేచోట్లంతా వెదికాడు.... అనుమానంతో అక్కడక్కడ బావుల్లోకూడా వెదికాడు.... సెట్టికి ఆ పిల్ల ఎక్కడా కనపళ్లేదు.... తిరిగి తిరిగి అలసిపోయాడు. కొండమీద. శివాలయంవేపు వెళ్లాడు. మెట్లు ఎక్కలేక, ఎక్కలేక ఎక్కి. శివాలయం ఆవరణంలో వున్న మర్రిచెట్టు క్రింద కాస్సేపు నిలబడ్డాడు. పిల్ల అక్క డెందు కుంటుంది అనుకున్నాడు. రానే వచ్చానుగదా అని గర్భగుడివైపు వెళ్లాడు స్వామికి నమస్కరించడానికి.... సెట్టి ప్రాణం లేచివచ్చింది.... దేవుడే ప్రత్యక్షమయినట్లు భావించాడు. గర్భగుడి ముందు స్తంభానికి చేరగిలపడివుంది ఆ పిల్ల. పలక ముక్కలన్నీ ముందు పడివున్నాయి.

సెట్టి గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. దగ్గరికెళ్ళి చూశాడు.
పిల్ల స్పృహ తప్పి పడివుంది. సెట్టి అంగలువేస్తూ నాలుగిళ్ళ అవతల
చూశాడు. అప్పుడే లోపలికి వస్తున్న పూజారి శివయ్య సెట్టిని చూసి,
"ఇదేమిటయ్యా! ఎవరీ అమ్మాయి!" అన్నాడు. కర్పూర వెలుగులో
కొత్త పిల్ల కావాలి అన్నాడు సెట్టి. శివయ్య నీళ్ళు అభిషేక తీర్థం తెచ్చి
పిల్ల ముఖం మీద చల్లాడు.... పిల్ల నెమ్మదిగా కదిలింది. కొత్త తీర్థం
గొంతులో పోగానే కళ్లు తెరిచింది.

"అప్పుడప్పుడు ఈ మూగపిల్ల అవ్వతో గుడికి వస్తూవుంటుంది.
పాపం ఎందుకు ఈ వేళప్పుడు వచ్చిందో!" అన్నాడు శివయ్య. సెట్టి
కళ్లు తుడుచుకొంటూ "నామూలంగానే— నేను వాళ్లకి అప్పువున్నాను...
నాలుగురోజుల నుంచీ వస్తు.... అందుచేతే పిల్ల స్పృహ తప్పింది"...
"అట్టాగా? పాపం ఆ మూగపిల్ల చివరికి భగవంతునిని ప్రార్థిస్తే తన
ఆకలి తీరుస్తాడనుకుంది కాబోలు"— "అంతే! అంతే! నాలాటి దుర్మా
ర్గుడిని అడిగే బదులు. ఆ పిల్ల మూగహృదయంతో దేవుణ్ణే అడిగి
వుంటుంది" అంటూ సెట్టి బండి కట్టించి, పిల్లని ఇంటికి తీసికెళ్లాడు...
అవ్వ ఇంట్లో లేదు.... పిల్లని వెదకడానికి వెళ్లివుంటుంది. వెంటనే
పొయ్యి వెలిగించాడు. సెట్టి కొడుకుచేత పంపిన గింజలు, వెచ్చాలు
ఓమూల వున్నాయి. వెంటనే కాసిని గింజలువేసి జావ తయారుచేశాడు
సెట్టి.... మూగపిల్ల సెట్టి చేసేదంతా గుడ్లప్పగించిచూస్తూ వుండిపోయింది.
ఒకమూల తల్లి. చంటిపిల్లలు మూసినకన్ను తెరవకుండా పడివున్నారు...
వాళ్లందరికీ కూడా డాక్టరు తనే! మందు, గంజీ— లేక ఆ కుటుంబం
అలా నేల కంటుకుపోయింది. మూగపిల్లకు గంజి తాగించాడు. పిల్ల
కళ్లల్లో ప్రాణం వచ్చింది. వెంటనే సెట్టి చేతిలో గంజి గిన్నె [illegible]
తీసుకొని ఆపిల్ల— తల్లికి, చిన్నపిల్లలకి కొత్త కొత్త గంజి త్రాగించింది...
వాళ్లందరికీ గంజి కడుపులోకి పోగానే కొత్త ఊపిరివచ్చింది.... మూగ



పిల్ల ముఖం వికసించింది. కృతజ్ఞతతో సెట్టివైపు చూసింది.— ఇప్పు
మందం మీద కూర్చున్న సెట్టి తల్లకిందులై చూశాడు. తన కుటుంబ
ని ఏమౌతారు! తనేమిటి! ఏమిటీ విచిత్రం! తనువంతటా ఒళ్ళు
రోజులో ఎంత మార్పు తెచ్చాడు వాడు! అని సెట్టి ఆశ్చర్యపడుతూ
వుంటే.... అతని హృదయము సంతృప్తితో నిండిపోయింది....

అవ్వ వచ్చిందాకావుండి పోదామనుకున్నాడు సెట్టి.... కాని
అవ్వ ఎంతకీ రాకపోయేసరికి వెదకడానికి బయలుదేరాడు.... అవ్వ
ఎదురొచ్చింది. గుండెలు బాదుకొంటూ "నా బిడ్డ కనపడలేదు బాబూ"
అంటూ— "ఇదిగో అవ్వా! నేను తీసుకొచ్చాను" అని మూగపిల్లను
చేరేశాడు సెట్టి— 'నాతల్లి వచ్చావంటే' అంటూ అవ్వ మూగపిల్లను
కావలించుకొంది. సెట్టి చేసినదంతా మూగపిల్ల. అవ్వతో తన భాషలో
చెప్పింది.... "మీ ఋణం నేను జన్మంతైనా తీర్చుకోలేను సెట్టిగారూ!"
అంది అవ్వ కృతజ్ఞతతో. సెట్టి సిగ్గుపడ్డాడు.... మూగపిల్లను రోజూ
బాగా చదువుకు రోజూ వస్తూండమని చెప్పి. అవ్వతో వెళ్లొస్తానని
చెప్పివెళ్లబోయాడు. ఏదో తను చెప్పినిదాన్ని ఆపుకొంటున్న మాట
"గాయంలాగా సెట్టి మనసును పట్టి ఆపింది." అవ్వా! యిందాక నేను
అబద్ధం చెప్పాను. ఆ పలక నేనే ఎత్తివేసి పగలగొట్టాను" అని సెట్టి
తలవంచుకొన్నాడు! పోనీలే నాయనా అంది అవ్వ. సెట్టి హృదయం
ఆనందంగా నవ్వింది.... సెట్టి ఇక అబద్ధాలు చెప్పడానికి సాహసించడు.
సెట్టి ఇంటికి వెళ్లాడు. మర్నాడు మూగపిల్ల కోసం కొత్తపలక, బలపం
కొనివుంచాడు. అంతేకాదు.... అంతేకాదు. ఆ పిల్లకు కొత్తబట్టలు
ఇంట్లో వాళ్లకుకూడా బట్టలు కొని వుంచాడు ఇచ్చి పంపడానికి— మూగ
పిల్ల మర్నాడు పరుగెత్తుకుంటూ వచ్చింది.... ఒళ్లో పండ్లు, తాంబూలం,
చిన్ననోట్లకట్ట వున్నాయి. చేతిలో పలకకూడా వుంది. సెట్టి నిశ్చేష్టుడై
మూగపిల్లను చూస్తూవుండిపోయాడు. పలక చూపించింది మూగపిల్ల

[illegible]

Scanned with CamScanner